www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 నవంబర్ 2023
5
వైఎస్ఆర్

సచివాలయంలో కేంద్ర బృందం పరిశీలన

బోర్డును పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ప్రజాశక్తి-వల్లూరు : గ్రామ సచివాలయాన్ని బుధవారం కేంద్ర అధికారుల బృందం ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అన్నిటిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను వాటి వివరాలను పరిశీలించారు. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గురించి పంచాయతీ కార్యదర్శి శివకుమార్ కేంద్ర బృంద సభ్యులు పటం ద్వారా క్షుణ్ణంగా తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు అభిషేక్ రోహిత్ కుమార్, భరత్ రోహిత్, బ్రిడ్జ్ సతీష్, కడప, బద్వేలు డిఎల్‌పిఒలు మస్తాన్వలి, రమణారెడ్డి, కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బలరామ్మూర్తి పాల్గొన్నారు.

జోరుగా గ్రావెల్ తవ్వకాలు..!

- పట్టపగలే దర్జాగా తరలింపు
- రాయల్‌గా రియల్ ఎస్టేట్ దందా
- పట్టని క్వాలిటీ, రెవెన్యూ అధికారులు
- కనుమరుగవుతున్న పచ్చని పైర్లు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

చెరువులు, గుట్టల్లో గ్రావెల్ త్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా తవ్వేస్తూ అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రావెల్ యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా గ్రావెల్ తరలించే వారికి అధికారుల అండదండలు తోవడంతో పట్టపగలే అక్రమంగా తరలిస్తున్నారు. నియోజవర్గంలో ఒకవైపు ఇసుకను మరోవైపు గ్రావెల్‌ను తోలుకున్నోడికి తోలుకున్నంత రీతిలో దందా నడుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుకను ప్రధాన అస్త్రంగా చేసుకొని పెన్నా నదిని మరోవైపు చిత్రావతి నదిలోని ఇసుకను ట్రాక్టర్లు టిప్పర్లులతో ఇష్టానుసారం కాంట్రాక్టర్లు తోలుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుకను భవిష్యత్ తరాలకు ప్రశ్నార్థకంగా చేస్తున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ప్రధాన రహదారులకు పక్కన ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎలాంటి అడ్డు, అదుపు లేకుండా చెరువులలోను, కొండ గుట్టలలోను ఉన్న మట్టి, గ్రావెల్‌ను ట్రాక్టర్లతో తోలుకొని తక్కువ ఎత్తులో ఉన్న భూములను ఎత్తులేపుతున్నారు. ప్రభుత్వ స్థలాలను గుంతలుగా మార్చేస్తున్నారనడం నగ్నసత్యం. ఇలా రియల్ ఎస్టేట్ వారు, మరో వైపు అధికార పార్టీ నాయకులు సహజ వనరులను ఊడ్చేస్తూ భవిష్యత్తును ప్రశ్నార్థకంలో ముంచేస్తున్నారు. వారు మాత్రం గ్రావెల్‌తో భూములను ప్లాట్స్‌గా మార్చి సొమ్ము చేసుకుంటూ అధికారులకు ముఖ్యంగా రెవెన్యూ అధికారులకు ముడుపులు, క్వాలిటి కంట్రోల్ అధికారులకు ఒక ట్రాక్టర్‌కు ఒక్కో రేటు కమీషన్‌ల వ్యవహారం నడుస్తుందని ప్రజలు,

గ్రావెల్ తవ్వేయడంతో గుంతలుగా మారిన గుట్టలు

పదుల సంఖ్యలో గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్లు

కొంతమంది ట్రాక్టర్ యజమానులు చెబుతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.650 చొప్పున అందులోనే క్వాలిటి కంట్రోల్ వారి కమీషన్ ఉన్నదని చెబుతున్నారు. అధికారుల అండదండలు లేనిదే పట్టపగలు చెరువులలోని నల్లమట్టి, గుట్టలలోని గ్రావెల్, సుద్ద మట్టి ఇష్టానుసారంగా ఎలా తీసుకుపోతారని బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ముద్దనూరు రోడ్డులో, గండికోట రోడ్డుపై, గుడారమ్మ చెరువులలో మట్టి, గ్రావెల్ తీసుకుపోవడంతో పెద్ద పెద్ద గుంతలతో దర్శనం ఇస్తున్నాయి. పెన్నా, చిత్రావతి, నదులలో కూడా పెద్ద ఎత్తున ఇసుక గుంతలు కనపడుతున్నాయి. ఇలా సహజవనరులను అధికార పార్టీనాయకులు, రాయల్‌గా తోలుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు సామాన్యునికి భవిష్యత్‌లో అందుబాటులో లేకుండా నేడు పచ్చని పేర్లను బూడ్చడానికి, ఇతర ప్రాంతాలకు, జిల్లాలకు, రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అధికారుల పాపం కూడా కచ్చితంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా ఒకవైపు పచ్చని పైర్లు రియల్ ఎస్టేట్ వారి చేతుల్లోకి వెళ్లి భవిష్యత్తులో ఆహార కొరతను సృష్టించబడతారనడంలో ఎలాంటి సందేహం లేదు.

సహజ వనరులను కొల్లగొడుతున్నారు

నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు సహజవనరులైన ఇసుక, గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. ఒకవైపు గ్రావెల్, మరోవైపు పెన్నా, చిత్రావతి నదులలోని ఇసుకను విచ్చలవిడిగా ట్రాక్టర్లు, టిప్పర్లతో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని అడ్డుకట్ట వేయకుంటే భవిష్యత్ తరాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- వి.శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

ట్రాక్టర్ పట్టుబడితే రూ.లక్ష జరిమానా

అత్యధికంగా గ్రావెల్, ఇసుకను దొంగగా రవాణా చేస్తున్నారని తమకు సమాచారం అందింది. వెంటనే ఆ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. గండికోట రోడ్డులో వారం నుంచి అధికంగా సుద్ద మట్టి గ్రావెల్‌ను తరలిస్తున్నారని తెలిసి తానే స్వయంగా వెళ్లి పరిశీలించాను. ట్రాక్టర్ గ్రావెల్‌తో కనపడిన రూ.లక్ష జరిమానా విధిస్తాం.

- గుర్రప్ప, తహశీల్దార్, జమ్మలమడుగు.

గడప గడపలో క్రికెట్ ఫీవర్!

- సెమీస్ వీక్షణకు భారీ స్క్రీన్ ఏర్పాటు
- వరల్డ్‌కప్ ఫైనల్ బెర్త్‌పై ఆశలు
- టివిలకు అతుక్కుపోయిన యువత

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/కడప

జిల్లాలోని గడప గడపనూ క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. 20 రోజులుగా ఇండియాలో ఐసిసి ఆధ్వర్యంలో క్రికెట్ ప్రపంచకప్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇండియా వరుసగా తొమ్మిది లీగ్ మ్యాచ్‌ల్లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. లీగ్ దశను దాటిని అనంతరం సెమీ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌కు అర్హత సాధించాల్సి ఉంది. ముంబయ్‌లోని వాంఖడే స్టేడియంలో బుధవారం ఇండియా-న్యూజిల్యాండ్ జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఇండియాకు గట్టి ప్రత్యర్థిగా పేరు గడించిన న్యూజిల్యాండ్ సెమీ ఫైనల్‌లో ఢీకొనడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. యువతలో క్రికెట్ పట్ల ఎనలేని ఆసక్తి కలిగిన ఉన్న నేపథ్యంలో క్రికెట్ అభిమానుల అభిరుచికి అనుగుణంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీ స్క్రీన్లు, నగరంలోని పలు కూడళ్లలో పోస్టర్లను ఏర్పాటు చేసి లైవ్‌మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేసింది.

ఆర్ట్స్ కళాశాల మైదానంలో సందడే సందడి

ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో భాగంగా ఇండియా న్యూజిల్యాండ్‌ను ఢీకొంది. తొలుత ఇండియా బ్యాటింగ్ చేయడంతో ఇళ్లు, కార్యాలయాలు, ఆర్ట్స్ కళాశాల మైదానాలు అనే తేడా లేకుండా జిల్లా యువత

కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో బిగ్ స్క్రీన్‌లో క్రికెట్ వీక్షిస్తున్న ప్రజలు

టివిసెట్లకు అతుక్కుపోయింది. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఇండియన్ బ్యాట్స్‌మెన్స్ కొట్టే ఫోర్లు, సిక్స్‌లకు ఈలలు, కేకలతో ఆర్ట్స్ కళాశాల మైదానం ప్రతిధ్వనించడం విశేషం. ఇదే తర హాలో జిల్లాలోని గడప గడపలోని టెలివిజన్ సెట్ల దగ్గర జిల్లా యువత సందడి సందడిగా కనిపించింది.

బెట్టింగ్‌రాయుళ్లు అలర్ట్? : క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లు అలర్ట్ అయ్యారా అనిపిస్తోంది. మంగళవారం రాత్రి పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బి.టెక్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ పంపించిన నేపథ్యం కారణమని తెలుస్తోంది. రాజకీయ పరమైన చర్యలు తీసుకున్నప్పటికీ ఆధునిక యాప్‌లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు తన కార్యకలాపాలను సాగించకుండా ఉంటారనుకోవడం అత్యాశే అవుతుందనడంలో సందేహం లేదు.

సంతృప్తికర స్థాయిలో అర్జీల పరిష్కారం : కలెక్టర్

మహిళను సమస్య అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-వేంపల్లె

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికి మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని సభా భవనంలో జగనన్నకు చెబుతాం అనే మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ప్రాల్గొన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు నుండి దరఖాస్తులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు స్వీకరించి క్రింది స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు మంజూరుతో పాటు డికెటి పట్టాలకు రిజిస్టర్ పట్టాగా ఇచ్చేందుకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారులకు పారదర్శకంగా, సంతృప్త స్థాయిలో నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులకు సూచించారు. స్థానిక సమస్యలు సచివాలయ పరిధిలోనే పరిష్కారం కావాలన్నారు. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను మండల స్థాయిలో పరిష్కరించే దిశగా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పభుత్వం అత్యంత ప్రధాన్యతతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయి సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం అయ్యేలా మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం అందించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల అర్జీలకు అధికారులు అందించే పరిష్కార నివేదికలు స్పష్టంగా ఉండాలని, ఏ ఒక్క అధికారి తాత్సారం గాని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో ఆయా శాఖల సమస్యలను నేరుగా సంబంధిత అధికారులే పరిష్కరిస్తారని స్థానిక ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటి స్థలం లేని నిజమైన లబ్ధిదారులు అందరికి ఇంటి స్థలాలను మంజూరు చేస్తామని అయితే స్థలం మంజూరు అయిన లబ్ధిదారులు మాత్రం ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. హౌసింగ్ కు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడ లబ్ధిదారులకు సకాలంలో మంజూరు అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు ఎస్టీ, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగన్న కలెక్టర్‌ను కలిసి ఎస్సీ రైతులకు ఇచ్చిన డికెటి భూములను రిజిస్టర్ భూములుగా మార్చాలని కోరారు. ఎగువ తూపల్లె ఎస్సీ కాలనీ నుండి వైఎస్ఆర్ ప్లాంట్ వరకు రోడ్డు వెడల్పు చేయాలని అలిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ నాగ సుబ్బారెడ్డి కోరారు. అమ్మగారిపల్లె శ్మశాన వాటికి వరకు సిసి రోడ్డు వేయాలని వైసిపి నాయకుడు రాజగోపాల్‌రెడ్డి కలెక్టర్‌కు దరఖాస్తులు అందించారు. వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం కోసం 20 ఎకరాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. రేషన్ బియ్యం తక్కువగా వస్తున్నాయని కోటా పెంచాలని ఎంపిటిసి భారతి జాయింట్ కలెక్టర్‌ను కోరారు. శ్రీరాంసాగర్ కాలనీలో తాగునీటి సమస్య ఉందని మహిళాలు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. వాటర్ గ్రిడ్ ద్వారా త్రాగునీటిని సరఫరా చేసేందుకు ట్యాంకులు నిర్మాణం జరుగుతున్నదని వచ్చే జూన్ నాటికి త్రాగునీటిని ఇబ్బందులు తొలగి పోతాయని మహిళాలకు కలెక్టర్ చెప్పారు. ప్రతి ఇంటికి కూడ తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సభా భవనంను కలెక్టర్ వి.విజయ్ రామరాజు తనిఖీ చేసి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జడ్పీ సిఇఒసుధాకర్ రెడ్డి, డ్వామా పీడీ యధుభూషణన్ రెడ్డి, డిఇఒ రాఘవరెడ్డి, ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, తహశీల్దార్ చంద్ర శేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, పిఆర్ డిఇ రవిచంద్రరెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఇఇ సిద్దారెడ్డి, హౌసింగ్ ఎఇ సుకుమార్‌రెడ్డి, ఎంపిటిసిలు కటిక చంద్రశేఖర్, వార్డు మెంబర్లుతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని శివాలపల్లె వద్ద వెలసిన శ్రీకాశీవిశ్వనాథ స్వామి ఆలయంలోని శ్రీకాశీ విశాలాక్షి అమ్మ వార్లకు దాత ఇందిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, సరస్వతి దంపతులు రూ.1.36 లక్షలు విలువచేసే బంగారు ఆభరణాన్ని ఆలయ చైర్మన్ గొర్రెపాటి శివారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు లక్ష్మయ్య స్వామి గారికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బాలికలకు ఎఫ్సీఎస్ ఫౌండేషన్ స్థాపకులైన డాక్టర్ గీత, టామ్ సౌజన్యంతో మదర్ థెరీసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య విద్యపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం స్థానిక పాఠశాలలో 8 నుంచి10వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఆరోగ్య విద్యా విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి, చిత్తా ప్రజలరెడ్డి మాట్లాడుతూ బాలికలకు 12 ఏళ్ల నుండి శరీరంలో వివిధ రకాలైన మార్పులు చెందుతూ ఉంటాయన్నారు. ఆ మార్పుకు అనుగుణంగా మనం తినే ఆహార పదార్థాలు, చేసే వ్యాయామం, సక్రమంగా ఉన్నట్లయితే, బాల బాలికలు అనారోగ్యాలకు గురికాడని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలు కూడా చేసుకుంటున్నారని, అలా చేయటం వల్ల రాబోయే కాలంలో తల్లికి రక్తహీనత కలిగే అవకాశం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం బాలికలకు ఆరోగ్య విద్య పుస్తకాలను అందించారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాలలో కెల్లా గొప్పదనాన్నారు. రక్తదానం వల్ల ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడవచని పేర్కొన్నారు. రక్త దానం చేయాలంటే ముందుగా ప్రతి ఒక్క వ్యక్తి తమ బ్లడ్ గ్రూపులను తెలుసుకొని ఉండాలని చెప్పారు. కావున ప్రతి విద్యార్థి ఈ బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ కార్యక్రమంలో పాల్గొని తమ రక్తం గ్రూపు తెలుసుకోవాలని తెలిపారు. రక్తదానం చేసి బ్లడ్ బ్యాంకులలో నిల్వ ఉంచినట్లయితే అవసరం ఉన్నప్పుడు ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం ఇవ్వడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శచీదేవి, డాక్టర్ గురు మోహన్‌రెడ్డి, నాగవేణి, ఇండియన్ రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బద్వేలు

విద్యారంగం పట్ల పాలకుల వైఖరి మారకపోతే పోరాటాలు తప్పవని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ హెచ్చ రించారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేల్, గోపవరం యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకుంటూ ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. జగన్ సర్కార్ చర్యల వల్ల రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత పడ్డాయని, ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ సొమ్మును ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గురు ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శశిధర్ కుమార్ మాట్లాడుతూ జగన్ సర్కార్ ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపులకు పాల్పడుతున్నదని తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ బద్వేల్ మండల అధ్యక్షులు టి.శివప్రసాద్, ట్రెజరర్ ఎ.గురయ్య, గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిస్టఫర్, సి.కంచిరెడ్డి, ట్రెజరర్ ఎం.రామ చంద్రయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.చెన్నయ్య, ఎస్.దేవానందం, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్.సుబ్బరాజా, బి.వి.శ్రీనివాసులరెడ్డి, కె.సుధాకర్, ఎం.నరేష్, ఎస్.మస్తాన్‌వలి, కొండయ్య, నరసింహులు, గౌస్‌బాషా, పి.తిరుపాల్ రెడ్డి, విశ్వనాథ్, ఆర్.వెంకట సుబ్బయ్య, ఎస్.తిరుపాలయ్య, పి.ఆర్థర్ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

రజక ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వల్లూరు : గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఈ నెల 26 జరిగే రజక ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు చెన్నూరు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వల్లూరు రజక కాలనీలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక జాతి కోసం రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు చేస్తున్న కృషి తమవంతు మీరందరూ సభకు హాజరుకావాలని కోరారు. రజక సోదరులందరూ మహాసభకు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రజక ఉద్యోగ సంఘం నాయ కులు సురేంద్ర, వేణు మాయల్, వల్లూరు రజక నాయకులు రవి, శ్రీను, చిన్నప్ప, వెంకటసుబ్బయ్య, ప్రశాంత్, హరి, రాము పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై న్యాయ పోరాటం

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైసిపి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులపై న్యాయ పోరాటం చేస్తామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, జనసేన జిల్లా ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్ అన్నారు. గాయత్రి టవర్స్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్మో హన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే టిడిపి నాయకులను అక్రమ అరెస్టు చేయిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘించి వైసిపికి తొత్తులుగా విధులు నిర్వహిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరి ప్రసాద్, నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి, జిలాని బాషా పాల్గొన్నారు.

గణిత శాస్త్రంలో శంకర్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి-కడప అర్బన్: కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ (గణిత) విభాగంలో సహాయ ఆచా ర్యులుగా పనిచేస్తున్న బి.వీర శంకర్‌కు కర్నూలు రాయలసీమ విశ్వవి ద్యాలయం పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి తెలిపారు. శంకర్‌ను కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, డాక్టర్ ఐ.శ్రీవాణి అభినందించారు.

హరీష్‌కు వైవీయూ డాక్టరేట్

యోగి వేమన విశ్వవిద్యాలయం భూగ ర్భశాస్త్ర శాఖ విభాగంలో పరిశోధక విద్యార్థి హరిష్ విజయ్‌కు డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈయన భూగర్భ శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్.శ్రీనివాస గౌడ్ పర్యవేక్షణలో "సెడి మెంటరీ సెరికల్చర్ అండ్ దైర్ ఎన్విరా న్మెంటల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ది పాపాగ్ని సబ్ బేసిన్ ఆఫ్ ది కడప బేసిన్, అంధ్రప్రదేశ్, ఇండియ" అనే అంశం పైన పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి జారీ చేశారు. హరీష్ విజయ్‌ని విసి చింతా సుధాకర్, రిజిస్టర్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సురేష్ యాదవ్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-చెన్నూరు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి, పిహెచ్‌సి కమిటీ చైర్మన్, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ అన్నారు, బుధవారం స్థానిక పిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాలను కూడా అభివృద్ధిపరిచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పిహెచ్‌సికి రోజూ 80 నుండి 100 మంది వరకు ఒపి వస్తున్నారన్నారు. ప్రతి సోమవారం చర్మవ్యాధుల డాక్టర్, జనరల్ మెడికల్ డాక్టర్ అందుబాటులో ఉంటారని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని మండల ప్రజలు పిహెచ్‌సి వైద్య సేవలు ఉపయో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ, చల్లా వెంకటసుబ్బారెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎఫ్ఎయూలో ప్రణాళిక దినోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్

అంతర్జాతీయ నమూనాలను స్థానిక ప్రణాళికా వ్యూహాలలోకి చేర్చడమే టౌన్ ప్లానింగ్ ఉద్దేశమని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ అన్నారు. బుధవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విభిన్న ప్రణాళికా విధానాలను స్వీకరించడం అలాగే సానుకూల స్థానిక ప్రభావాన్ని సృష్టించడానికి ప్రపంచ పరిజ్ఞానాన్ని పెంచడం ద్వారా స్థానిక అవసరాలను పరిష్కరించడాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై.పవన్ కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ సుప్రియ, టౌన్ ప్లానింగ్ అధ్యాపకులు రీతూ మెర్సీ, నారపురెడ్డి, సందీప్, ప్రత్యూష, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

మళ్లీ అవకాశమిస్తే రాష్ట్రం పాతాళానికే : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ప్రజలు వైసిపికి మళ్లీ అవకాశం ఇస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పాతాళానికి పడిపోతుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆర్.కె.నగర్లో బుధవారం యాటగిరి రాంప్రసాద్ ఆధ్వర్యంలో వైసిపి నాయకుడు రాజుతో పాటు 50 కుటుంబాల మహిళలు టిడిపిలో చేరారు. వారికి కడప నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాధవి, రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టిడిపి అధికారంలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. డివిజన్ కార్పొరేటర్ నగర మేయర్‌గా ఉన్నా, ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సిఎం అయిన వారు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని ఆరోపించారు. జిల్లా పర్యటనలో సొంత నియోజకవర్గంలోనే జగన్ ప్రజలు గో బ్యాక్ అన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా వైసిపిను ప్రజలు తిరస్కరిస్తున్నారని చెప్పారు. మాధవి మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు నోటికి వచ్చింది చెప్పి, అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. దేశం హయాంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను, జగన్ నిర్వీర్యం చేశారని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికత కోసం డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి రహదారి సమస్య

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలోని గుజ్జులవారి.ల్లె, జి.కొత్తపల్లెలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ దృష్టికి రహదారి, విద్యుత్ సమస్యలను ఆయా గ్రామాల ప్రజల తీసుకొచ్చారు. సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్లు రూ.2750 నుంచి మరో నెలలో రూ.3 వేలతో పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి నాయకులు రామకృష్ణారెడ్డి, రెడ్డయ్య, సచివాలయ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, ఎంపిడిఒ సుజాతమ్మ, సిఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

మంచి జరగాలంటే మళ్లీ జగన్ సిఎం కావాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదలకు మంచి జరగాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వల్లపు వరప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక భాకరాపురం సచివాలయంలో వారు మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు బాగుండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అలాంటి మంచి చేసే నాయకుడు మరోసారి ముఖ్యమంత్రి కావడం అవసరమని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్స్ కిషోర్, విజయ నాయుడు, కోడి రమణ, పురుషోత్తం డేనియల్, రాజశేఖర్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ 9వ సచివాలయం పరిధిలోని 18, 19 కౌన్సిల్ వార్డుల్లో బుధవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ మాట్లాడుతూ 9వ సచివాలయం పరిధిలో రూ.11 కోట్ల 84 లక్షల మేర లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి ఈశ్వరి, శివ, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. అల్లాడుపల్లి గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపిపి టి.లక్షుమయ్య, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గృహసారధుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ జిసి కిశోర్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చక్రాయపేట : పార్టీలు, కులాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని వైసిపి మండల ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం చక్రాయపేట గ్రామ సచివాలయంలో వాలంటీర్లు, గ్రామ ప్రజలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చక్రాయపేట గ్రామానికే రూ.25,51,98,085తో 33 ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాయన్నారు. ఎంపిడిఒ శివారెడ్డి, జడ్పిటిసి శివప్రసాద్‌రెడ్డి, ఎంపిపి మాధవి బాలకృష్ణ, ఎంపీటీసీ లీలావతి, సర్పంచ్ అర్షద్ ఆయుబాషా, మండల కో-ఆప్షన్ నెంబర్ గౌస్లాదం, పంచాయతీ సెక్రటరీ గంగులయ్య, గండి దేవస్థానం నెంబర్ రామాంజిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలన ఆదర్శనీయం

- వైసిపి నాయకులు నర్రెడ్డి మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

దేశానికి ఆదర్శంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నారని, జనం మెచ్చేలా పాలన సాగిస్తున్నారని ఉమ్మారెడ్డిపల్లె వైసిపి నాయకులు నర్రెడ్డి మధుసూదనరెడ్డి అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర, ప్రజల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క హామీని నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ప్రభుత్వ ఫలాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని మండల, గ్రామాల, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు వివరించారు. బొందలకుంట గ్రామ పంచాయతీలోని ప్రజలకు అవసరమైన వసతులు కల్పించి ప్రభుత్వ పథకాలు చేరువ చేస్తానన్నారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చేలా పాటుపడతానన్నారు. ప్రజల ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు వైసిపికి ప్రజలు తమ విలువైన ఓటు వేయాలని ఆయన కోరారు.

పంచక్షేత్ర దర్శనం కోసం ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కార్తీకమాసం సందర్భంగా భక్తుల కోసం పంచక్షేత్రదర్శిని ప్రత్యేక బస్సును 4 సోమవారాలు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు పులివెందులలో సోమవారం ఉదయం 5గంటలకు బయలుదేరి యాగంటి, నందవరం, మహనంది, రామేశ్వరం (ప్రొద్దుటూరు), కన్యతీర్థం చూసుకొని తిరిగి రాత్రి 8గంటలకు పులివెందుల చేరుతుందన్నారు. భక్తులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. సర్వీస్ నంబర్ 50999గా పేర్కొన్నారు. పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.300 ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లో బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 73829 34750, డీఎంఈ 73828 67696, ఎస్‌టిఐ 79898 99479, డిఎం 99592 25780 ఫోన్ నెంబర్లు సంప్రదిం చాలన్నారు.

మకర తోరణం వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శ్రీమిట్ట మల్లేశ్వరస్వామి దేవాలంలో వెలసిన పార్వతీదేవికి బుధవారం నోసం వెంకట రామసుబ్బారెడ్డి వరలక్ష్మి దంపతులు మకర తోరణాన్ని సమర్పించారు. వీరికి ఆలయ పూజారులు రుద్రస్వామి, శివస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించినారు. కార్యక్రమంలో గుడి ఆలయ కమిటీ చైర్మన్ చింతకుంట సుదీకర్‌రెడ్డి, పాలక మండలి సభ్యుడు పొట్టిపాటి మాధవాచారి, ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

శ్మశానవాటికను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొత్తపల్లి పంచాయతీ పరిదిలోని అమృతనగర్ ఫేస్-2లో శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆ మేరకు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. 15ఏళ్ల క్రితం శ్మశాన వాటికను ఇచ్చినారని గుర్తు చేశారు. కాని ఈ శ్మశానవాటికలో కంపచెట్లు మొలిచి పశువులు, విషసర్పాలు తిరుగుతుండడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ఇచ్చిన స్థలంలోనే చదును చేసి ప్రహరీ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఆటోశీను, పీరయ్య, ఫరీద, వెంకటలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, నాగలత, పీరాంబి, రాము, సుందరం, శంకర్ పాల్గొన్నారు.

పిల్లలు గ్రంథాలయాలకెళ్లేలా ప్రోత్సహించాలి

పుస్తకాలను తిలకిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు.. మేధోశక్తిని పెంపొందించే లోగిళ్లు.. పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహించాలని సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు వేణు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పుస్తక ప్రదర్శన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ఈ తరం విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, తమ మేధోశక్తిని పెంపొం దించుకోవాలన్నారు. విద్యార్థులు విద్యతోపాటు విజ్ఞానం, లోకజ్ఞానం పెంపొందించుకునేందుకు తప్పక గ్రంథాలయాలకు వెళ్లాలని ఆయన సూచించారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యస్. అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరి యన్లు బాబ్జి, సుబ్రహ్మణ్యం, సురేష్, నవాబ్, జేమ్స్, ఉద్యోగులు శ్రీనివాసులు సుబ్బమ్మ, రాం ప్రతాప్, పాఠకులు, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : గ్రంథాలయాలు సమస్త విజ్ఞాన భాండాగారాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పట్టణ గ్రంథాలయంలో బుధవారం లైబ్రేరియన్ కిరణ్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలిరోజు అహోబిలాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతకుమారి, పద్మా లింగారెడ్డి పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** సింహాద్రిపురం గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ శాఖ అధికారి శేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : లక్ష్యం వైపు పయనించాలంటే పుస్తక పఠనం తప్పనిసరి అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగాల ఉషారాణి తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉషారాణి, పౌర గంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ అమీరుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథ పఠనం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువుల బాబును సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, గ్రంథాలయ అధికారి టి.తిరుపతమ్మ, రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, హౌసింగ్ బోర్డ్ గ్రంథాలయ అధికారి భాస్కర్, హెల్పర్ నాగలక్ష్మి దేవి పాల్గొన్నారు. **చెన్నూరు :** మండల ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం నిర్వాహకులు కె.హరికృష్ణ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పాఠకులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. బాల సాహిత్యం, కథల పుస్తకములు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకములు, నవలలు, హిందీ, ఆంగ్ల పుస్తకములు, నిఘంటువులు, భగవద్గీత, భారతరామాయణ, భాగవతం వంటి పుస్తకాలు ప్రదర్శించారు.

ఆత్మవిశ్వాసం, మనోధైర్యమే విజయానికి పునాదులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆత్మవిశ్వాసం, మనోధైర్యమే విజయానికి పునాదులు అని, ఆ దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిఇఒ రాఘవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ఇలాంటి మోటివేషనల్ క్లాసెస్ ద్వారా మనోధైర్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తున్నామని చెప్పారు. నిజ జీవితంలో విద్యార్థులు రాణించాలంటే మార్కులే ప్రామాణికం కాదన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకొని ఆ దిశగా ప్రయత్నం చేయాలని తెలిపారు. కృషి, తపన, ఆసక్తి ఉంటే సాధించలేని ఏదీ లేదని తెలిపారు. ఉద్వేగానికి గురి కాకుండా ఓర్పు, నేర్పు, సహనంతో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులతో కలిసి విజయకేతనం చూపిస్తున్న డిఇఒ, పిఒ

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్లాలి

క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న వివేకానంద ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మానవత విలువలపై చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ శివానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని, అప్పుడే వారు తమలో ఉండే అంతర్గత శక్తులను వెలికి తీయగలరని తెలిపారు. ఆ విధంగా అమూల్యమైన ఈ మానవ జీవితానికి ఒక అర్థాన్ని ఇవ్వగలరన్నారు. ప్రతి విద్యార్థి ప్రత్యేకమైన వారని, సమాన శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారని పేర్కొన్నారు. వాటిని వెలికి తీసే భాధ్యత వారిదేనని తెలిపారు. బాల్యాన్ని ప్రయోగశాలగా మార్చుకుని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల సహకారంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఆ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి రూ.10 వేల విలువ గల క్రీడా దుస్తులను విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేశారు. చదువు, క్రమశిక్షణ, ఆటల్లో మంచి ప్రతిభ కలిగిన రాజేశ్వరి అనే బాలికకు బెస్ట్ స్టూడెంట్‌గా.. స్టేట్ లెవల్‌లో క్రీడల్లో రాణించేలా విశేష కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుని హసీనాకు బెస్ట్ టీచర్‌గా జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల, సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, టి.వెంకటసురేష్, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

పంట మార్పిడిపై అవగాహన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని త్రిపురవరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట మార్పిడి పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిఎ, ఆర్ నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే ల్యాండ్ యూజ్ ప్లానింగ్ రీజినల్ సెంటర్ డాక్టర్ వి.రామమూర్తి పంట మార్పిడి గురించి రైతులకు ముఖాముఖి నిర్వహించి, అవగాహన కల్పించారు. పంట మార్పిడి కింద 100 ఎకరాల్లో వరి పంటకు బదులుగా ఇతర పంటలు వేసేలా మార్పే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో గ్రామంలో 150 ఎకరాల వరకు పంట మార్పిడి చేసుకునే రైతులకు విత్తనాలు, పురుగు మందులు అందజేస్తారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఎఒ నాగార్జున మాట్లాడుతూ వరికి బదులుగా మినుము, నువ్వు, దోస తదితర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెవికె ఎస్ఎంఎస్ డాక్టర్ సాయి మహేశ్వరి, సచివాలయ వ్యవసాయ సహాయ అధికారి విష్ణు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దళిత యువకుడు బెనర్జీపై హత్యాయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ డిమాండ్ చేశారు. గత నెల 28న హత్యాయత్నం చేసిన ఘటన తెలిసిందే. శిక్షించాలని కోరుతూ శివాలయం సర్కిల్ నుండి బుధవారం ర్యాలీ నిర్వహించారు. పాండురంగస్వామి దేవాలయం వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగి రెండు వారాలు దాడిపోయినప్పటికీ ఇంత వరకు వారి ఆచూకీ తెలుపక పోవడం శోచనీయమన్నారు. మాలమహానాడు రాష్ట్ర కన్వీనర్ చింతల దానమ్మ మాట్లాడుతూ ప్రవీణ్‌రెడ్డి ప్రోత్సాహంతోనే బెనర్జీపై దాడి చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బెనర్జీ తల్లి రామేశ్వరం బుజ్జమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకున్న జగన్ ప్రభుత్వం : రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రైతు పక్షపాతిగా పేరుగాంచిన జగన్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజుపాలెం మండల రైతులకు ఖరీఫ్ సీజన్‌లో 6544 ఎరాలు రబీ సీజన్‌లో 5300 సాగునీటిని అందించి పంటను నమోదు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. నేడు ముఖ్యమంత్రి జగన్ ప్రతి సంవత్సరం పంట నమోదు చేసి రూ.35కోట్లు రాజుపాలెం మండలానికి నష్టపరిహారం అందించారన్నారు. రాజుపాలెం మండలంలో ఒక వెయ్యి ఎకరాలకు మాత్రమే నీరు అందకుండా పోతోందని, ఇందుకు కారణం కాలువలకు దూరంగా ఎత్తైన ప్రదేశంలో ఆ భూములు ఉండడమేనని తెలిపారు. రాజుపాలెం రైతులకు ఆర్‌బికె ద్వారా ట్రాక్టర్లు వ్యవసాయ పనిముట్లు 40శాతం సబ్సిడీతో అందించామన్నారు. అనంతరం తమందరికీ మూడు సెంట్ల భూమిని షరతులేకుండా సొంత ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని పాత్రికేయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కాకార్ల నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

రేషన్ షాపు మార్చాలంటూ మహిళల వినతి

ఎర్రగుంట్ల : 17వ కౌన్సిల్ వార్డు లబ్ధిదారుల రేషన్ కార్డులను రేషన్ దుకాణం 8 నుండి 7వ రేషన్ దుకాణానికి మార్చాలంటూ స్థానిక కౌన్సిలర్ ఎరికలరెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దార్ నాగేశ్వరరావుకు మహిళలు వినతిపత్రాన్ని అందించారు. కౌన్సిలర్ ఎరికల రెడ్డి మాట్లాడుతూ వార్డులోని దాదాపు 300 రేషన్ కార్డులు పక్కనున్న ఏడవ రేషన్ షాప్ కాదని, నడి ఊరిలోని ఎనిమిదవ రేషన్ షాపునకు బదిలీ చేశారని తెలిపారు. దీనివల్ల లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందిం చవలసిన వాహనం సరిగా రావడం లేదన్నారు. అనంతరం తహ శీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులతో దర్యాప్తు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా స్థానిక రేషన్ దుకాణానికి మార్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ

వేంపల్లె : నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి శివనరసింహ ప్రతిభ చూపినట్లు హెచ్ఎం శివమునెమ్మ తెలిపారు. జిల్లాస్థాయిలో బాలోత్సవం చిత్రలేఖనం పోటీల్లో 11 మంది విద్యార్థులు పాల్గొనగా తమ విద్యార్థి చక్కటి ప్రతిభ చూపినట్లు చెప్పారు. శివ నరసింహ విద్యార్థి రిటైర్డ్ డిప్యూటీ డిఇఒ నాగమునిరెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు. డ్రాయింగ్ మాస్టర్ కెవి సురేష్ కృషిని, విద్యార్థిని పాఠశాల కమిటీ చైర్మన్ గురుప్రసాద్, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారుల బంగారు భవిష్యత్తే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డిసిసిబి) లక్ష్యమని ఆ బ్యాంక్ మేనేజర్ దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం 12 ఏళ్లలోపు చిన్నారులచే కిడ్స్ ఖాతాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం పొదుపు ఖాతాలను, రికరింగ్ డిపాజిట్లను ప్రవేశపెట్టామన్నారు. ఈ ఖాతాలను ప్రారంభించడం వల్ల చిన్నారులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కిడ్స్ ఖాతాలను ప్రారంభించే వారికి కిడ్స్ బ్యాంకు డబ్బాను ఉచితంగా ఇస్తామన్నారు. చిన్నారుల కోసం సహకార బ్యాంకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లు అమర్నాథ్‌రెడ్డి, జ్యోష్న, జ్యోతి, అంకాలమ్మ గూడూరు ప్రాథమిక సహకార సంఘం సిఇఒ సలాం పాల్గొన్నారు.

కిడ్స్ ఖాతాలను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ప్రజాదరణ ఓర్వలేక బిటెక్ రవి అక్రమ అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలో బిటెక్ రవికి వస్తున్న ప్రజాదరణ చూసి వైసిపి ప్రభుత్వం బి టెక్ రవిని పోలీసులతో అరెస్టు చేయించడం దుర్మార్గమని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేదర రవికుమార్, పోతిరెడ్డి శివ, మహమ్మద్, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గెలుపొందినప్పటి నుంచి అందరికి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై బి టెక్ రవి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అరెస్టు చేసే ముందు 41 ఎ నోటీసులు ఇవ్వకుండా బి టెక్ రవిని పోలీసులు అక్రమ అరెస్టు చేయడం శోచనీయమన్నారు. పులివెందుల నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బి టెక్ రవికి ప్రజలు హారతులు పడుతున్నారని అన్నారు. ప్రజలు అన్ని విషయాలు చూస్తున్నారని తెలిపారు. వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది : పిసిసి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, ప్రతిపక్ష నాయకులను పోలీసులతో కేసులు పెట్టించి అరెస్టు చేయిస్తున్నారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ బి టెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని అరెస్టు చేయడం పిరికిపంద చర్య అన్నారు. దొంగలు పడ్డ 6 నెలలకు కుక్కలు మొరిగినట్లుంది ప్రభుత్వ వాలకమన్నారు. ఈ ఏడాది జనవరి 25న కడప విమానాశ్రయం వద్ద చిన్న తోపులాట జరిగితే నవంబర్ 14న వైవియు వద్ద రాత్రి సినిమా ఫక్కీలో అరెస్టు చేయడం విడ్డూరమన్నారు. ఎన్నికల నాటికి రాజకీయ ప్రత్యర్థుల అందరినీ జైలులో పెట్టి మళ్లీ అధి కారంలోకి రావాలనే దుర్బుద్ధి సిఎం జగన్‌కు ఉన్నట్లుంది అన్నారు. మహామహా నియంతలే కాలగర్భంలో కలిసి పోయారని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన చేయాలని సిఎం జగన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సూచిస్తున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అరెస్టుపై మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్పందిస్తూ.. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పది నెలల కిందట రవిపై నమోదైన కేసులో ఇప్పుడు అరెస్టు చేయడం దారుణమన్నారు. నాడు పోలీసులపై దాడి చేశారని కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్ని రోజులు కేసును పట్టించుకోకుండా ఎలా ఉన్నారని ప్రశ్నించారు. కేసు నమోదైన నాటి నుంచి ఇప్పటి వరకు రవి ప్రజల్లోనే ఉన్నారని, ఎక్కడ తలదాచుకోలేదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత దుర్మార్గమైన పాలనను తాను ఏనాడు చూడలేదన్నారు. టిడిపి రాష్ట్ర, జిల్లా నాయకులు అందరం బిటెక్ రవికి అండగా ఉంటామన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘు రామిరెడ్డి, టిడిపి నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు, వెంకట కొండయ్య పాల్గొన్నారు.

- పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవిపై అక్రమంగా నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని టిడిపి రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అన్న క్యాంటీన్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో జగన్ కు ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే రవిని అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర నాయకులు విఎస్ ముక్తియార్ పాల్గొన్నారు.

ఖాజీపేట : టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి టెక్ రవి అరెస్టును ఖండిస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వైసిపికి ప్రజాబలం తగ్గడంతో బీటెక్ రవి, ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలను అరెస్టు చేశారన్నారు. నాడు బీటెక్ రవి చేసిన ఆందోళనలో ఎఎస్ఐకి గాయాలైనట్లు ఏనాడూ పోలీసులు చెప్పలేదన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ అక్రమ అరెస్టులపై విచారించి నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

- విద్యుత్ ఎస్ఇ రమణ

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ ఎస్ఇ రమణ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను, సబ్‌స్టేషన్‌లను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఇ రమణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు 11 సబ్ స్టేషన్‌లతో వేంపల్లె టౌన్, రూరల్‌గా 2 విద్యుత్ కార్యాలయాలుగా విభజించినట్లు చెప్పారు. సిబ్బంది కూడా పనులను బాధ్యతగా చేపట్టాలని కోరారు. లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు విధిగా పరిశీలించి, ముందస్తు మరమ్మత్తులు చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బందిని అదేశించారు. ఇండక్షన్ టెస్టర్లు వాడి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాల వల్ల గత సంవత్సరం జిల్లాలో రూ.18 కోట్ల మేర ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సర్వే ప్రకారం ప్రతి 100 కుటుంబాలకు 24 కుటుంబాలు ఎసిలు వాడుతున్నట్లు చెప్పారు. అనంతరం పులివెందుల విద్యుత్ డివిజన్ పరిదిలోని పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, చక్రాయపేట, వేంపల్లి మండల క్షేత్రస్థాయి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో పులివెందుల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, గురుమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

19న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 19న కడప యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించే జిల్లా కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్ కోరారు. ఆ మేరకు మైదుకూరు మండలం వనిపెంటలో బుధవారం ఆయన యుటిఎఫ్ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఈ కౌన్సిల్లో చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే ఉద్యమ కార్యాచరణపై తీర్మానాలు, భవిష్యత్ పోరాటాలపై నిర్ణయాలు చేస్తారని వివరించారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా ఈ కౌన్సిల్ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొహిద్దిన్‌ఖాన్, విజయ్‌కుమార్, మహబూబ్ బాషా, వనమాల రాము, జబ్బార్, సురేష్, గురివిరెడ్డి, హెఫ్సిబా, కరిమున్నీసా బేగం, నరసింహమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.పి నెంబర్ 23/2022

జి.నాగరాజు. ...అర్జీదారు

ఎదురి

డాక్టర్ ఎం.శ్రీనివాసులు వగైరాలు. ...రెస్పాండెంట్లు

17వ రెస్పాండెంట్ కి ఐ.పి నోటీసు

17వ రెస్పాండెంట్ చిరునామా

శ్రీ రత్న , వాసవి అపార్ట్‌మెంట్,
శంకరపురం, కెనరా బ్యాంకు దగ్గర, కడప.

పై అర్జీదారు మీద మరియు ఇతరుల మీద పై కోర్టులో ఐ.పి నెంబర్ 23/2022 దాఖలు చేసి ఉన్నారు. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న పై కేసు 8-12-2023వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేదీ : 8-12-2023

జె.పి. బసవరాజు,
యస్. తారకేశ్వర్లు,
బి. శ్రీనివాసులు,
కర్నూలు.
అర్జీదారు న్యాయవాదులు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
ఐ.ఏ.నెం : 537/2018
ఓ.ఎస్.నెం : 300/2018

దారా లాజర్, తండ్రి సుందరం ...పిటిషనర్/ప్లైంటిఫ్

వర్సెస్

తాటి సుబ్బరాయుడు తండ్రి వెంకట సుబ్బన్న చనిపోయినందున వారి తరపు రక్త సంబంధీకులు
1.తాటి వెంకటలక్ష్మి
2.తాటి సుచరిత
3.తాటి ఉషారాణి
4.తాటి సుమంత్.
...రెస్పాండెంట్స్

ఈ నెంబర్ దావాను వాది రాజశ్రీ కోర్టు నందు నీ పైన దాఖలు చేసినారు. మీలో ప్రతివాది నెం:2, రెండవ రెస్పాండ్ గారైన మీకు 29.11.2023 తేదీన ఉదయం గం.10.30 ని.లకు రాజశ్రీ కోర్టు వారి ముందర హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును. అట్లు రాని యెడల కోర్టు వారు మీ పైన తదుపరి ఉత్తర్వులు పాలించెదరు.

//మహారాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

దారా ఓబులేసు బి.ఏ.,బి.ఈడి.,ఎల్ఎల్‌బి
అడ్వకేట్
ప్రొద్దుటూరు, వైఎస్సార్ కడప జిల్లా.

మహారాజశ్రీ సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 59/2023

వద్దిబోయిన లక్ష్మినరసమ్మ, భర్త యానాదిరెడ్డి, అట్లూరు గ్రామము, అట్లూరు మం॥, వై.యస్.ఆర్. జిల్లా. ...వాది

Vs

బి.ఎస్.ఖల్లాముల్లా, S/o గౌస్ మొహిద్దిన్, ప్రైవేటు బిజినెస్, అట్లూరు గ్రా॥, అట్లూరు మం॥, వై.యస్.ఆర్.జిల్లా.
...ప్రతివాది

పై నెంబరు దావా షెడ్యూలు ఆస్తిపై వాది అయిన నేను ప్రతివాది పైన పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ కోరకు పై కోర్టులో దావా దాఖలు చేయగా రాజశ్రీ కోర్టు వారు I.A.No.485/2023 పిటిషనర్/వాది తరపున Temporary Injuction ఆర్డర్స్ జారీ చేసియున్నారు. ఇందుకు గాను రెస్పాండెంటు/ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట 01.12.2023వ తేదీన ఉదయం 10.30 నిమిషాలకు హాజరై నీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.

షెడ్యూలు : All that part and parcel of Land to an extent of AC 4:18 cents in Sy.No.980 situtated in Atlur Village, Atlur Mandal, YSR Kadapa District covered under DKT No.38/1414 bounded by East:Bovilla Madhusudhan Reddy and Babu West Vaddiboyina Lakshmi Narasamma and others houses, North:Road, South: Rendla Bujjamma land.

వాయిదా తేది: 1/12/2023

//వాది తరుపున అడ్వకేట్లు//
పి.వి.యల్.భానుప్రకాష్,
యు.ఓబయ్య, బి.వెంకటరత్నం
అడ్వకేట్లు, సిద్ధవటం, కడప జిల్లా.

శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : ప్రొద్దుటూరు
ఐ.ఏ.నెం : 1052/2021 ఇన్
ఓ.ఎస్.నెం : 679/2021

దేగల యేసోబు తండ్రి మార్కు వయసు 58సం.లు ఇంటి నెం 4/71 కొర్రపాడు గ్రామం రాజుపాలెం మండలం కడప జిల్లా. ...వాది

వర్సెస్

డి-2 జి.బ్రహ్మయ్య తండ్రి మస్తాన్ 48సం.లు మెడికల్‌షాపు గాంధీ రోడ్డు ప్రొద్దుటూరు టౌన్ వైఎస్సార్ కడప జిల్లా.
...రెండవ రెస్పాండెంట్/రెండవ ప్రతివాది/డి.2

దావా సమన్లు

రెండవ ప్రతివాదికి/రెండవ రెస్పాండెంట్ ఈ నెంబరు దావాను ప్రతివాది అయిన మీపైన వాది పర్మి నెంట్ ఇంజెక్షన్ కోరుతూ దావా దాఖలు చేసినారు.ఈ దావాలో రెండవ ప్రతి వాది అయిన మీకు దావాలో మరియు ఐఏనెం:1052/2021లో పర్మినెంట్ ఇంజెక్షన్ ఆర్డర్ -పై కోర్టులో నువ్వు 07-12-23వ తేదీన ఉదయం గం.10.30 ని.లకు హాజరు అయి నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షమున చట్టం ప్రకారం తీర్మానించడం జరుగుతుంది.

షెడ్యూలు

కడప డిస్ట్రిక్ట్ ప్రొద్దుటూరు సబ్ డిస్ట్రిక్ట్ లో చేరిన గోపవరం పంచాయితీ వార్డు నెంబర్4 ద్వారకా నగర్ ఏరియా సర్వేనెం:281/ఏ1 వెరసి 0.05సెంట్లు (లేక)0.02హెక్టార్లు తూర్పు: కొర్రపాడు రోడ్డు పడమర: గొడ్లవేటి సుబ్బారెడ్డి స్థలం దక్షిణం:రస్తా ఉత్తరం:మల్లేలమ్మ గుడి.

//గౌరవ కోర్టువారి ఉత్తర్వు మేరకు//

దారా ఓబులేసు బి.ఏ.,బి.ఈడి.,ఎల్ఎల్‌బి
అడ్వకేట్
ప్రొద్దుటూరు, వైఎస్సార్ కడప జిల్లా.